# పరిసరాల శుభ్రతతో వ్యాధుల నివారణ

**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి**
**పారిశుధ్య పనులను పరిశీలించిన సంబంధిత అధికారులు**

కడ్తాల్ : మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుజాత

కడ్తాల్, జూలై 23: పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో సుజాత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మాజీ వార్డు సభ్యుడు భిక్షపతి, నాయకులు ఇమ్రాన్, రమేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్‌టౌన్ : వార్డులోని పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్లు వెంకట్రాంరెడ్డి, నందీశ్వర్

**వార్డుల పరిశీలన..**

షాద్‌నగర్‌టౌన్ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను దూరం చేయవచ్చని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 22,26వ వార్డుల్లోని కాలనీ పరిసరాలు, పారిశుధ్య కార్యక్రమాలను మంగళవారం కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఎవరూ ఉండవద్దని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్రాంరెడ్డి, నందీశ్వర్, నాయకుడు యాదగిరి యాదవ్, మున్సిపల్ సిబ్బంది సాయిబాబా, జావీద్, జవాన్ మల్లేశ్ పాల్గొన్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**

షాబాద్ : వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోతుగల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ అన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు షాబాద్ మండలంలోని పోతుగల్ గ్రామంలో, గిరిజన తండాల్లో కూలిపోయే స్థితిలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న ప్రజలను మంగళవారం అప్రమత్తం చేసి వారిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వర్షానికి కూలిపోయే స్థితిలో ఇండ్లు ఉన్న వారు ఆశ్రయం కోసం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఉండాలని చెప్పారు. వర్షాలతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తగు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఆయన వెంట సిబ్బంది తదితరులున్నారు.

# అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందిస్తాం

**కుర్మిద్దలో అమ్మమాట అంగన్‌వాడీ బాట**
**పోషకలోపం ఉన్న చిన్నారి సర్జరీ సక్సెస్**
**చిన్నారి పేరుమీద మొక్కలు నాటిన ఐసీడీఎస్ అధికారులు**

చిన్నారి సహస్రతో మొక్క నాటుతున్న సీడీపీవో శాంతిశ్రీ

యాచారం, జూలై23: మండలంలోని కుర్మిద్ద గ్రామంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కుర్మిద్ద గ్రామానికి చెందిన సహస్ర పోషక లోపం, తక్కువ బరువుతో బాధ పడేది. 8నెలల వయసులో పోషకాహార లోపంతో బాధ పడుతున్న సహస్రకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసీ, అంగన్‌వాడీ టీచర్ సుల్తానా ప్రత్యేక శ్రద్ధతో ఆహార థెరపీ అందించారు. అయిపప్పటికీ ఫలితం లేకపోవడంతో చివరికి వైద్యులను సందర్శించారు. చిన్నారి హార్ట్‌కు హోల్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో విషయాన్ని సీడీపీవో శాంతిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె అప్పటి కలెక్టర్ అమయ్‌కుమార్ దృష్టికి చిన్నారి విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో చిన్నారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఆయన నిమ్స్ దవాఖానకు రెఫర్ చేశారు. చిన్నారిని ఐసీడీఎస్ అధికారులు నిమ్స్ దవాఖాన సూపరింటెండెంట్‌తో మాట్లాడి అడ్మిట్ చేశారు. ఆక్సిజన్ కొరత కారణంగా చిన్నారిని రెండు నెలలు దవాఖానలో ఉంచి ఉచితంగా సర్జరీ చేశారు. సర్జరీ విజయవంతం అవడంతో చిన్నారి తల్లిదండ్రులు, ఐసీడీఎస్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. నిమ్స్ డాక్టర్ ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. ఇందులో భాగంగా అధికారులు సహస్ర గృహాన్ని సందర్శించి లోపపోషణ నుంచి చిన్నారి సాధారణ స్థాయికి చేరడంతో గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారి పేరుమీద గ్రామంలో మొక్కలు నాటారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సీడీపీవో శాంతిశ్రీ మాట్లాడుతూ..అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు విద్యా బుద్ధులు నేర్పనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తులసి, అంగన్‌వాడీ సిబ్బంది ప్రమీల, సుల్తానా, ఆశ చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

ఆమనగల్లు : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్ వైజర్ పార్వతి, సిబ్బంది

**సామూహిక అక్షరాభ్యాసం**

ఆమనగల్లు : ఐసీడీఎస్ ఆమనగల్లు ప్రాజెక్టు పరిధిలోని ఆమనగల్లు మున్సిపాలిటీలో మంగళవారం అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు అంగన్‌వాడీ సూపర్ వైజర్ పార్వతి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ 3 సంవత్సరాల పిల్లలందరూ అంగన్‌వాడీలో తమ పేర్లను నమోదు చేయించాలని ఆమె సూచించారు. ఆట–పాటలతో కూడిన విద్యాభ్యాసం, పౌష్టికాహారం ఉంటుందన్నారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శబరి, సరళ, తిరుమళ, పద్మ, కవిత, బాలమణి, టీచర్లు సంధ్య, రాజ్యలక్ష్మి, రజిత, నాగమణి, లక్ష్మి, స్వరూప, తబిత, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## 27, 28న జిల్లాస్థాయి పౌరాణిక నాటిక పోటీలు

షాద్‌నగర్‌టౌన్, జూలై 23: షాద్‌నగర్‌లో ఈ నెల 27, 28న రంగారెడ్డి జిల్లా శ్రీవాణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి పాలమూరు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాస్థాయి పౌరాణిక నాటిక పోటీలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బండారి రమేష్ ఆవిష్కరించారు. ఈ పోటీలలో వివిధ జిల్లాలకు సంబంధించిన ప్రాంతాల నుంచి 22కళాబృందాలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కోశాధికారి వెంకటేష్, కళాకారులు కోటేశ్వరరావు, విద్యాసాగర్‌రెడ్డి, రఘురాంచారి పాల్గొన్నారు.

## ఫొటో గ్రాఫర్ల ఎగ్జిబిషన్ విడుదల

యాచారం, జూలై 23 : తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి నరేందర్‌రెడ్డి మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు ఏర్పుల లింగం మాట్లాడుతూ.. ఈనెల 26, 27, 28తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ఫొటో గ్రాఫర్లు మహేందర్‌రెడ్డి, సంగం ప్రభాకర్, మల్లేశ్, ఆనంద్, గిరి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పెద్దఅంబర్‌పేట, జూలై 23: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చని గ్రామం, హరిత బడి కోసం కృషి చేయాలని మాజీ ఎంపీటీసీ చేగూరి వెంకటేశ్ అన్నారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, రాజేంద్రప్రసాద్, శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## 26 చలో అసెంబ్లీ

చేవెళ్లటౌన్, జూలై 23: ఈ నెల 26వ తేదీన నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో భవన నిర్మాణ రంగ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించి పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. థంబ్ సిస్టంను రద్దు చేయాలని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మంజుల, శివ, రామచందర్, పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, భవన నిర్మాణ రంగ కార్మికులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

షాబాద్, జూలై 23: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డిజిల్లా ప్రధాన కార్యదర్శి సామ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ, తాళ్లపల్లి, షాబాద్, హైతాబాద్, తిమ్మారెడ్డిగూడ, చందనవెల్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో షాబాద్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణ, శేరిలింగంపల్లి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు డేవిడ్‌రెడ్డి, ఎల్. నర్సింహులు, అనంతరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి

షాబాద్, జూలై 23: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం అన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పత్తిపంట సాగుపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వెంకటేశం మాట్లాడుతూ...రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటల సాగులో మంచి దిగుబడులు సాధించాలని చెప్పారు. క్లస్టర్ల వారీగా వానకాలం, యాసంగి సీజన్లలో పంటల సాగుపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రాజేశ్వరి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : రాంనూంతలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో అరుణకుమారి

**పంటసాగులో శాస్త్రీయ పద్ధతులు తప్పనిసరి**

ఆమనగల్లు : రైతులు పంటసాగులో శాస్త్రీయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాంనూంతల గ్రామంలో రైతులు సాగుచేసిన పత్తి, మొక్కజొన్న, జొన్న, వరి పంటలను ఆమె పరిశీలించారు. అనంతరం ఏవో అరుణకుమారి మాట్లాడుతూ...వరిలో నారుమడిలో కార్పోప్యూరాన్ 3జీ గుళికలను ఎకరా నారుమడికి 2 కిలోల చొప్పున వాడటం వలన 45 రోజుల వరకు కాండం తొలుచు పురుగును అరికట్టవచ్చని, అదే విధంగా నాటే ముందు కొనలు తుంచి నాటడం వలన కాండం తొలుచు పురుగు యొక్క గుడ్లు నివారించవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు శంకర్, సక్రు, శంకర్, డోలీ, పిప్లి, తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్ ఎంపీడీవో సూపరింటెండెంట్‌గా**

## శారద బాధ్యతల స్వీకరణ

షాబాద్, జూలై 23: షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా శారద మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన విజయలక్ష్మి బదిలీపై ఇటీవల హయత్‌నగర్ మండలానికి వెళ్లారు. ఫరూఖ్‌నగర్ మండలంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శారద బదిలీపై షాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని తెలిపారు.

## టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులు బదిలీ

తుర్కయాంజాల్,జూలై 23: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇ.శ్రీనివాసులును బదిలీ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ దేవేందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లనున్నారు. శ్రీనివాసులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో కూడా విధులను నిర్వర్తిస్తున్నాడు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఆమనగల్లు, జూలై 23: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం పీడీఎస్‌యూ నాయకులతో కలిసి ఆయన సందర్శించి మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మండల తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ లలితకు అందజేశారు. వారి వెంట విద్యార్థి సంఘం నాయకులు రాహుల్, అర్జున్, నితిన్, పవన్, రాము తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు స్థలాల్లో షెడ్ల తొలగింపు

పెద్దఅంబర్‌పేట, జూలై 23: ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ రవీందర్‌దత్తు స్పష్టంచేశారు. పెద్దఅంబర్‌పేట గ్రామంలోని 244/34 సర్వేనంబర్‌లో వేసిన షెడ్లను రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం తొలగించారు. సర్కారు భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేసినా ఊరుకునేదిలేదని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టినా, కబ్జా చేసినా వెంటనే సమాచారం ఇవ్వాలని రవీందర్ దత్తు కోరారు.

## నేడు విద్యుత్ నిలిపివేత

యాచారం, జూలై23: మండలంలోని అయ్యవారిగూడలో చెట్ల కొమ్మల తొలగింపు దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

కడ్తాల్, జూలై 23: తెలంగాణలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబునాయక్ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ, వచ్చే నెల 9న హైదరాబాద్‌లో 'సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభను' నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం కడ్తాల్ మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్స్‌లో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్ ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన సన్నాహాక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన జీవో 33కి చట్టబద్ధత కల్పించాలని, ఏజెన్సీ ప్రాంతంలో రద్దు చేసిన జీవో 3ను వెంటనే పునరుద్ధరించాలని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన గిరిజన పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించి, తండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రాల్లో ఐటీడీఏలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర కో కన్వీనర్ రఘు రాంరాథోడ్, జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, ఉపాధ్యక్షుడు కిషన్‌నాయక్, నాయకులు భీంలాల్‌నాయక్, రాజూనాయక్, బీచ్చానాయక్, హీరాసింగ్, లక్ష్మతినాయక్, జగన్‌నాయక్, బలరాంనాయక్, శ్రీను, రమేశ్, లక్ష్మణ్, రవి, మోతిలాల్, రాజు పాల్గొన్నారు.

# అపూర్వం ఆత్మీయ సమ్మేళనం

మొయినాబాద్, జూలై 23 : మొయినాబాద్ మండల కేంద్రంలో ఉన్న మెథడిస్ట్ రూరల్ చిల్డ్రెన్స్ హైస్కూల్‌లో 2007–08 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు మంగళవారం మండల పరిధిలోని సురంగల్ గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 16 ఏండ్ల తరువాత కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యా నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

గుంతలగా మారిన ఫీరోజ్ నగర్ రోడ్డు

## రోడ్డు బాగు చేయండి..

మాడ్గుల, జూలై 23: రోడ్లను బాగు చేయండి సారు అంటూ ఫీరోజ్‌నగర్ గ్రామ ప్రజలు అధికారులు, నాయకులను వేడుకుంటున్నారు. మండలంలోని ఫీరోజ్ నగర్ నుంచి ముద్విన్ గ్రామానికి వెళ్లే రోడ్డు వర్షానికి గుంతలమయం కావడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రోడ్డు వేయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## మట్టికుప్పలు మరిచారు..

షాద్‌నగర్‌టౌన్, జూలై 23: షాద్‌నగర్ మున్సిపాలిటీ కేశంపేట రోడ్డు నుంచి విజయనగర్‌కాలనీకి వెళ్లే రోడ్డు పక్కనే నూతనంగా అంతర్గత మురుగుకాలువను ఏర్పాటు చేశారు. తవ్విన మట్టిని రోడ్డుపై వేసి విడిచిపెట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఇబ్బందిగా ఉన్న మట్టి కుప్పను తొలగించాలని కోరుతున్నారు.

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్లవెంట తెరుచుకున్న ఓపెన్ నాలాలు

## తెరుచుకున్న ఓపెన్ నాలాలు

**పట్టించుకోని అధికారులు.. భయాందోళనలో ప్రజలు**

ఇబ్రహీంపట్నం, జులై 23 : మున్సిపాలిటీలో పరిధిలోని పలు కాలనీల్లో కొన్నిరోజులుగా నాలాల పైకప్పులు తెరిచి ఉంచడంతో ఏ ప్రమాదం జరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఎడతెరిపి లేని వర్షాలతో రోడ్లన్నీ జలమయమై నాలాల్లో ఎక్కడ పడిపోతారోనని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ కమిటీ ఎన్నిక

తుర్కయాంజాల్, జూలై 23 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా బాలు, కోశాధికారిగా నవీన్, కార్యదర్శిగా శివకుమార్‌గౌడ్, మీడియా ఇన్‌చార్జిగా పి.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా రాజు, శేఖర్, బాల్‌రాజ్, కృష్ణ, స్పోర్ట్స్ ఇన్‌చార్జి, కల్చరల్ సెక్రటరీ నరేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ ఫొటో గ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

## అధికారులకు ఘన సన్మానం

మంచాల, జూలై 23: మంచాల మండల పరిషత్ కార్యాలయానికి సాధారణ బదిలీలో భాగంగా సూపరింటెండెంట్‌గా పనిచేసిన జంగయ్యగౌడ్ ఇబ్రహీంపట్నంకు బదిలీపై వెళ్లగా, అతడి స్థానంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం నుంచి బదిలీపై వచ్చిన ఎండీ అబ్దుల్ అజీమ్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ ఎం.భాస్కర్ మంగళవారం మంచాల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వారిని మంచాల ఎంపీడీవో బాలశంకర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

## వాల్‌పోస్టర్ విడుదల

**28న మలిదశ ఉద్యమ నాయకుడు చల్మారెడ్డి వర్ధంతిసభ**

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 23 : మలిదశ తెలంగాణ ఉద్యమంలో నాయకత్వం వహించిన తెలంగాణ జేఏసీ రంగారెడ్డిజిల్లా చైర్మన్ దివంగత వెదిరె చల్మారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఈనెల 28న ఇబ్రహీంపట్నంలోని భారత్ కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల వేదిక నాయకులు తెలిపారు. ఈ మేరకు చల్మారెడ్డి వర్ధంతికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం జేఏసీ చైర్మన్ కోదండరాం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ నెల 28న ఆదివారం ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి తెలంగాణ వాదులందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు వేదిక నాయకులు జంగయ్య, రమేశ్, రవీందర్, నిరంజన్, గౌస్, ముజిబ్ పాల్గొన్నారు.